క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శివకుమార్

తుక్కుగూడ: వార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కౌన్సిలర్ వై.శివకుమార్ అన్నారు. మంగళవారం పుర పరిధిలోని రావిర్యాల 4వ వార్డులో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వార్డులో ఇప్పటివరకు కోట్ల రూపాయాల నిధులతో పలు రకాల అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, నాయకులు వెంకటాచారి, మాధవరెడ్డి, గణేశ్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన దిశ కమిటీ సభ్యుడు



కేంద్రమంత్రితో దిశ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌యాదవ్

తుక్కుగూడ: కేంద్ర పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలను జిల్లా దిశ కమిటీ సభ్యుడు అంబోజీ శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం అహ్మదాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమాన్ని మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి సందర్శించామన్నారు. ఈ సందర్భంగా అక్కడే కేంద్రమంత్రిని కలిసి జిల్లాలోని యువత ఉపాధి కోసం పథకాలను అమలు చేయాలని కోరామన్నారు.

ఘనంగా అయ్యప్ప ఇరుముడి పూజ



కందుకూరు నుంచి ఇరుముళ్లతో శబరియాత్రకు వెళ్తున్న స్వాములు

కందుకూరు: కందుకూరులో అయ్యప్ప మహా పడి పూజ, ఇరుముడి పూజను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు వెంకటేశ్‌గుప్తా, కరుణాకర్‌రెడ్డి, భాస్కర్, శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ అనంతరం ఇరుముడి పూజను నిర్వహించారు. అయ్యప్ప శరణుఘోషలతో గ్రామం మార్మోగిపోయింది. అనంతరం 28 మంది స్వాములు ఇరుముళ్లతో శబరియాత్రకు తరలివెళ్లారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయొద్దు



స్థానికులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వ్యర్థాలు, చెత్తను రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే చెత్త ఆటోకు ఇవ్వాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. హయత్‌నగర్ పరిధి వీరభద్రనగర్‌కాలనీలో మంగళవారం ఆయన కార్పొరేటర్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. చెత్తను ఇష్టానుసారంగా పారబోస్తే దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతాయని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పలు కాలనీల్లోని రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని, చెత్తవేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ వెంట కాలనీవాసులు దశరథగౌడ్, విజయేందర్‌రెడ్డి, గాలయ్య, ఎల్లయ్య, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, నరేంద్రరెడ్డి ఉన్నారు.

రమేష్‌గౌడ్ సేవలు మరువలేనివి

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఆకుల రమేష్‌గౌడ్ సేవలు మరువలేనివని ఆయన ఆశయాలను కొనసాగిస్తామని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం రమేష్‌గౌడ్ 4వ వర్ధంతి సందర్భంగా యువ నాయకుడు అఖిల్‌గౌడ్ ఆధ్వర్యంలో లింగోజిగూడ లిబర్టీ చౌరస్తాలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి రంగారెడ్డి హాజరై రమేష్‌గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ అభివృద్ధికి రమేష్‌గౌడ్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మురుగు నిలిచి.. దుర్గంధం భరించి

హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై అపరిశుభ్ర వాతావరణం

- తీవ్ర అవస్థలు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కందుకూరు చౌరస్తా రైస్‌మిల్ ఎదుట రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కందుకూరు: జాతీయ రహదారిని ఇష్టానుసారంగా నిర్మించి వదిలేయడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దీంతో అక్కడ మురుగు, వర్షం నీరు నిలిచి తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం తాత్కాలికంగా పనులు చేపట్టి మమ అనిపించారు. అయినా సంబంధిత అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదీ మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై దుస్థితి.

ఎనిమిదేళ్ల క్రితం పనులు

స్థానికంగా హైదరాబాద్–శ్రీశైలం రహదారిని ఎనిమిదేళ్ల క్రితం విస్తరించారు. ఆ సమయంలో కందుకూరు చౌరస్తా నుంచి కొత్తగూడ చౌరస్తా మధ్యలో ప్రణాళిక లేకుండా నిర్మాణం చేపట్టింది కాంట్రాక్ట్ సంస్థ. పాత కల్వర్టులను తొలగించి రోడ్డు నిర్మించింది. దీంతో పాటు కందుకూరు చౌరస్తా నుంచి కొత్తగూడ చౌరస్తా మధ్యలో రెండు వైపులా పల్లంగా నిర్మించడంతో పాటు అక్కడ రైస్‌మిల్ వద్ద ఉన్న కల్వర్టును తొలగించింది. దీంతో అప్పటి నుంచి మురుగుతో పాటు వర్షం నీరు నిలిచి సమస్యగా మారింది. గత ఏడాది స్థానికుల ఆందోళనలతో రోడ్డు కింద నుంచే కల్వర్టు నిర్మించి చేతులు దులుపుకొన్నారు. అక్కడి నుంచి నీరు బయటికి పోయే మార్గం లేక ప్రస్తుతం ఆ కల్వర్టు పూర్తిగా నిండిపోయి రోడ్డుపై మురుగు, వర్షం నీరు నిలుస్తుంది.

దుర్వాసనతో ఇబ్బంది

దీంతో అక్కడ నుంచి రాకపోకలు సాగించే వారితో పాటు ఆ సమీపంలోని వ్యాపారస్తులకు మురుగు నీటితో ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతుంది. దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు అధికమై అవస్థలు పడుతున్నారు. అయినా సంబంధిత యంత్రాంగం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తుంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

పరిష్కారం చూపాలి



రోడ్డు నిర్మించి మోరీ ఏర్పాటు చేయకపోవడంతో మురుగు, వర్షం నీరు నిలిచి ఇబ్బందిగా మారింది. గతంలో ఉన్న కల్వర్టు తొలగించడంతోనే సమస్య ఏర్పడింది. మేము వ్యాపారం చేసుకోలేకపోతున్నాం. అధికారులు స్పందించి పరిష్కారం చూపాలి.

– మల్లేశ్, వ్యాపారి, కందుకూరు

మురుగు నిలుస్తోంది



రైస్‌మిల్ ప్రాంతంలో మురుగు నీరు నిలిచి దోమలు, ఈగలు అధికమై ఇబ్బందిగా మారింది. డౌన్ కల్వర్టు నిర్మించినా నీరు బయటికి పోయే మార్గం లేదు. దీంతో రోడ్డుపైనే మురుగు నీరు నిలుస్తుంది. వాగు వైపు రోడ్డు పల్లం చేసి డ్రైనేజ్ నిర్మిస్తే సరిపోయేది.

– ప్రకాశ్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్, కొత్తగూడ

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ తదితరులు

కందుకూరు: కందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం చైర్మన్ డీ.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, ఎన్.నర్సింహ, జి.అంజమ్మ, కె.యశోధ, ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, ఎస్.పాండురంగారెడ్డి, హెచ్‌డీసీసీబీ డైరెక్టర్ పి.ఆనంద్, సీఈఓ ఎన్.యాదగిరిరెడ్డి, రైతులు పి.అంజయ్య, ఎ.రామిరెడ్డి, కె.సత్తయ్య, దర్శన్, బి.రాములు, చంద్రయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తుక్కుగూడ: తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై అయ్యప్ప భక్తుల ముసుగులో కొందరు భౌతికంగా దాడిచేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవిందు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌లు అన్నారు. మంగళవారం హెచ్‌ఎంను ఇరువురు నాయకులు వేరు, వేరుగా పరామర్శించి మాట్లాడారు. ఈ నెల 21న పాఠశాల అనంతరం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో అయ్యప్ప మాలధరించిన విద్యార్థిని హెచ్‌ఎం చేయి తగిలిందని తెలిపారు. దీంతో హెచ్‌ఎం కావాలనే విద్యార్థిని కాలుతో తన్నాడనే ఆరోపిస్తూ దాడికి పాలుపడటం అన్యాయమన్నారు. దళిత ఉద్యోగులపై దాడులు చేస్తే సహించమన్నారు.



హెచ్‌ఎం రాములును పరామర్శిస్తున్న నాయకులు

హెచ్‌ఎంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బోడ సామేల్, కందుకూరి జగన్, సత్తయ్య, నర్సింహ, దాసు, సరోజ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తకుప్పలు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఎటు చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లో ప్రధాన కూడళ్లు, చౌరస్తాల్లో చెత్తకుప్పలే కన్పిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని సలీంనగర్ పార్కు వద్ద, స్వామి వివేకానంద స్కూల్ చౌరస్తా, శాలివాహననగర్ తదితర ప్రాంతాల్లో భారీగా పేరుకుపోయాయ. కుళ్లిన ఆహార పదార్థాలు, వ్యర్థాలతో ఈగలు, దోమలు, క్రిమికీటకాలు పెరిగి రోగాలబారిన పడుతున్నామని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ భాష్యం పాఠశాల 12వ వార్షికోత్సవం సందడిగా జరిగింది. ఎన్‌ఆర్‌ఎస్‌సీ, ఇస్రో శాటిలైట్ స్టేషన్ ఇంజినీరు గోడి వేంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల సీఈఓ చైతన్య మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి విద్యాసంస్థలు, బోధనా సిబ్బందికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన, వందశాతం హాజరు కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల జెడ్‌ఈఓ అంకమ్మరావు, హైస్కూల్ ప్రిన్సిపల్ పల్లవి, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపల్ భానుమతి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



శాలిని (ఫైల్)

హయత్‌నగర్: డ్యూటీకి వెళ్తున్న చెప్పి బయటికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ అన్మగల్‌కు చెందిన శాలిని(25) వనస్థలిపురంలోని ఓ కళాశాలలో రిసెప్షనిస్టుగా పని చేస్తుంది. రోజు మాదిరిగా సోమవారం డ్యూటీకి వెళ్లి రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు కాలేజీకి వెళ్లి ఆరా తీయగా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్

మహేశ్వరం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటుందని పార్టీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని పెండ్యాల గ్రామంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామశాఖ అధ్యక్షుడిని, బూత్ కమిటీలను నియమించి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి సత్తాచాటాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడూ ఎండగడుతూ ప్రజలకు తెలియజేసి చైతన్యవంతం చేయాలన్నారు. ప్రజా సమస్యలపై ప్రతి కార్యకర్త పోరాడాలన్నారు. అంతకు ముందు పెండ్యాల గ్రామ బీజేపీ బూత్ కమిటీని నియమించి నియామకపత్రాలను అందజేశారు. పెండ్యాల బూత్ అధ్యక్షుడిగా దాసరి నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా దూళ్ల శ్రీశైలం, సభ్యులుగా మంత్రి మోహన్, తొంట నరేశ్, దూళ్ల మల్లేశ్, తొంట సురేశ్‌లను నియమించి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి, పెండ్యాల మాజీ సర్పంచ్ అయిల్ల యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బూత్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగరాజ్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న యాదయ్యగౌడ్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేపీ జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్యగౌడ్

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అమలు కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్యగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్న తూప్ర గ్రామంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి నూతనంగా బూత్ స్థాయి కమిటీలను నియమించి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతీ కార్యకర్త పోరాడాలని ఆయన సూచించారు. ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న తూప్ర గ్రామ బూత్ అధ్యక్షుడిగా సంకటి నాగరాజ్ ముదిరాజ్, కార్యదర్శిగా తుమ్మలసూరి శ్రీశైలం, సభ్యులుగా బండి ప్రవీణ్, బొగ్గుల రాఘవేందర్, నీరటి మహేశ్, సూరంపల్లి లింగం, పసులాది పాండు, సూరంపల్లి రమేశ్, రాజమోలి లింగం, బండి శ్రీనివాస్, పోలేపల్లి వినయ్, సంకటి శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ రఘుపతిగౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు కృష్ణనాయక్, పి.ప్రవీణ్, మురళీ, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో ధనుర్మాస పూజలు

దిల్‌సుఖ్‌నగర్: ధనుర్మాసం సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి దేవాయలంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తోరణ, గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సోమా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, మాజీ చైర్మన్ బంధం దామోదర్ గుప్తా, సుధాకర్‌గుప్తా, వైస్ చైర్మన్ నాగమల్లు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

4న లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

చాదర్‌ఘాట్: అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ కోరారు. ఈ నెల 4న మలక్‌పేటలోని బ్రెయిలీ పార్కులో నిర్వహించే వేడుకలకు మంత్రి సీతక్క అతిథిగా పాల్గొంటారని తెలిపారు.